# ఆశ

శ్రీ వాడపల్లి విజయభాస్కరరామారావు

బయట ఎండ కొంచెం తగ్గింది. అప్పుడే పక్క గదిలోంచి సియెస్టా నుండి లేచి వచ్చిన వెంకట్రామయ్యగారికి ఇక ఊపిరి తీసుకోడానికి వ్యవధి ఉండదు. క్రిందకు వెళ్ళి ప్రెస్ అంతా ఓ మాటు చూచి రావాలి. సంపాదకీయం రాయాలి తీసుకోవలసిన నిర్ణయాలు చాలా ఉన్నాయ్ ఆలోచిస్తూనే క్రిందకెళ్ళి నాలుగూ ఓ మారు చూసి వచ్చేసరికి పోస్టు వచ్చింది గుమాస్తా సార్ట్ చేసి తన సొంత ఉత్తరాలను తన గదిలోకి పంపించాడు.

ఉత్తరాల బొత్తిలో పసుపుబొట్ల కవరు. ముందు అదే తీశారు వెంకట్రామయ్యగారు పెళ్ళి ఎవరికా అనుకుంటూ.

బాబాయివద్దనుండి శుభలేఖ కొడుక్కి పెళ్ళి. పెళ్ళి కార్డుమీద బాబాయ్ కనపడుతున్నాడు.

తన నెంత ముద్దుచేసేవాడు బాబయ్య! తనకీ బాబయ్యంటే ఎంతో ప్రేమే. తన కంటె సుమారు పదేళ్ళు పెద్దేమో? తల నెత్తుకుని ఆడించేవాడు చిన్నతనంలో. బాబాయిని చూచి ఏన్నాళ్ళయింది? ఓ మారు వెళ్ళివస్తే! అబ్బో తనకు ఊరు కదిలేందుకెక్కడ దొరుకుతుంది అవకాశం?

పెళ్ళి అయిన తరువాత బాబాయిని కొడుకునీ కోడలినీ తీసుకుని హైదరాబాదు రమ్మంటే?

ముందు పెళ్ళి పిలుపును గురించి కామాక్షికి చెప్పాలి "ప్రేస్! కామాక్షిని పిలుస్తావా?" టేబిల్ మీద ఫోన్ తీసి ఆపరేటర్‌కు చెప్పాడు.

భర్తకు క్యారియర్ సర్ది, కొడుకు అరుణకు వడ్డించి తనూ భోజనం చేసి ఓ అరగంట పడుకుందామని తనగదిలో కెళ్ళింది కామాక్షమ్మ. అంతే నిద్రపట్టేసింది.

"హలో, ఎడిటర్ వెంకట్రామయ్యగారి ఇల్లు" ఆవులిస్తూ అంది.

"కామాక్షమ్మగారా! పంతులుగారు మిమ్మల్ని పిలవమన్నా రమ్మా!"

వెంకట్రామయ్యగారిని కార్యాలయంలోని వారందరూ పంతులుగారని పిలవడం రివాజు. ఈ వేళలో అంత అర్జంటు పనేమిటి చెప్మా అని ఆత్రంగా వింటోంది కామాక్షమ్మ.

బల్లమీద ఫోన్ మోగగానే తీసుకున్నారు వెంకట్రామయ్య "కామాక్షీ, బాబాయి వద్దనుండి ఇప్పుడే శుభలేఖ వచ్చింది. రాజేంద్రుణ్ణి జ్ఞాపకం ఉందా, కృష్ణమూర్తి బాబాయి కొడుకు. ఇన్నాళ్ళకి పెండ్లికి ఒప్పుకున్నాడన్న మాట. నారాయణమూర్తి గారని నాన్నగారి స్నేహితుడు. నీకు జ్ఞాపకం ఉందా? అతని కూతుర్ని ఇచ్చి పెళ్ళేట ముప్ఫైయవ తేదీని. ఇక నాలుగు రోజులే ఉంది పెళ్ళి. అరుణని తీసుకుని నువ్వెళ్ళరాదూ. ఎలానూ వాడికి పరీక్షలైపోయాయి కదా!"

"మీరూ రాకూడదూ!"

"నాకెక్కడ తీరిక? ఇక్కడ పత్రికో! నాకైతే రావాలనే ఉందికాని దేశంలో రాజకీయ పరిస్థితి... విద్యార్థుల అల్లర్లు..."

"సరేలెండి వాటిని గురించి పత్రికలో రాద్దురుగాని" కస్సుమంది ఎడిటర్‌గారికి ఏమనాలో తోచలేదు. కామాక్షమ్మ ఊరికే భర్తమీద విసుక్కుని బుసలుకొట్టే సామాన్య స్త్రీ కాదు.

ఏం మాటాడాలో తోచకా, ఫోన్ పెట్టేసి భార్య మనసు నొప్పించనూ లేక, మెల్లగా అడిగారు.

"అరుణ ఏంచేస్తున్నాడూ?"

"భోజనం చేస్తుండగా పక్కవాళ్ళ మహేందర్ వచ్చాడు. ఇద్దరూ ఎక్కడికో వెళ్ళారు."

"రేపురాత్రే బయలుదేరాలి కావలసినవన్నీ సర్దుకో నేను ఏడింటికే ఇంటికొచ్చేస్తా" ఫోన్ పెట్టేసి మళ్ళీ తీసారు.

"గ్రేస్! ట్రేడ్‌వింగ్స్‌కి ఫోన్‌చేసి విజయనగరానికి రేపు ఎక్స్‌ప్రెస్‌లో రెండు ఫస్ట్ క్లాసు బర్త్స్ బుక్‌చేయించు. టిక్కెట్లు ఇంటికి పంపమను నా ప్రయివేటు ఎకౌంట్‌లో బిల్ వేయమని చెప్పు."

* * *

ట్యాంక్‌బండ్ మీద స్కూటర్ శరవేగంతో పోతోంది.

"ధీరేసే జానాభాయ్!" పిలియన్‌మీద కూర్చున్న మహేందర్ అన్నాడు అరుణ చెవిలో.

"చూడ్రా, ఆటాక్సీవాడి పొగరు, మనకంటె ముందువెడదామని!" టాక్సీవాడికి సైడ్ ఇయ్యకుండా రోడ్డుమధ్యగా వెడుతున్నాడు. అటునుండి సరారోజీ లారీ నడుపుకుని వస్తున్నాడు. వాడి స్పీడు చూస్తుంటే అరుణకే భయం వేసింది. చటుక్కున గేరుమార్చి ఎడమకు తప్పుకుని లారీ వెళ్ళగానే మళ్ళీ రోడ్డు మధ్య కొచ్చాడు.

అరుణని మాటాడిస్తే మరీ ప్రమాదమని నోరుమూసుకు కూచున్నాడు మార్వాడీ మహేందర్.

కిశోర్ ఇంటిలో కలసిన మిత్రులకు ఊక దంపుడులో కాలం తెలియటంలేదు. "రేయ్ మహేందర్, నువ్వేం చెయ్యాలనుకుంటున్నావ్‌రా?" సడన్‌గా అడిగాడు కిశోర్.

"అరెయార్, ఇప్పుడెందుకురా ఆ గొడవంతా, రిజల్ట్స్ రానీయ్"

"వాడికేంరా, వాళ్ల నాన్న బిజినెస్‌లో దూరిపోతే సరి". అన్నాడు కరుణ

"సీ మొహం. ఏడిశావ్, నాకు పితాజీ బిజినెస్‌తో క్యా జరూరత్, ఓ చిన్న ఫ్యాక్టరీ పెట్టుకుంటాను."

"అది మరీ మంచిదిరా, మరో పది మందికి ఉపాది కల్పించినట్టవుతుంది నన్ను జనరల్ మేనేజర్‌గా వేసుకో. నెలకు వెయ్యి చాలు" మాష్టారి అబ్బాయి ప్రసాద్ అన్నాడు.

"పాపం మనవాడు అల్పసంతోషి!" అరుణ కామెంట్ చేశాడు.

"ఒరేయ్ అరుణా నువ్వేం చెయ్యాలనుకుంటున్నావ్‌రా?" కిశోర్ అడిగాడు.

"నేనా, నాకేం చెయ్యాలని లేదు".

వాడికేంరా కుసుమ్‌ని పెళ్ళాడి సంసారం చేసుకుంటే చాలు. ఆమె ద్రాక్ష తోటలన్నీ వాడివే వ్యవసాయం మనవాడికి పట్టుబడాలి కాని"... సాగదీశాడు తెలివిగా ప్రసాద్ కుసుమ్ అనగానే ఒళ్లు గగుర్పొడిచింది అరుణకి వాచీ చూసుకున్నాడు నాలుగే అయింది ఆరింటికి వస్తాను రెడీగా ఉండమని చెప్పాడు ఆమెకి.

కుసుమ్ తండ్రికి ఒక్కర్తే కూతురు కాబోయే అల్లుడే ఆసరా కావాలనుకుంటున్నాడు ముసలాయన. చాలా మర్యాదస్తుడు. మంచివాడు.

ఒరేయ్ ఇవాళ మనమంతా ఏడింటికి సరోజినిదేవి రోడ్‌లో నియోరిట్జ్‌లో ములాకత్ కావాలి. చాల రోజులైంది బార్‌కిపోయి. వెధవ పరీక్షలు ..హడావుడి ఓమారు ఖుషీ చెయ్యాలి."

ప్రసాద్, అరుణ సాంగత్యంతో తెలుగు బాగా పట్టుబడింది మహేందర్‌కి.

అరుణ ఆలోచనలకి ఆకస్మికంగా అవరోధం కలిగింది. "మొన్ననే అమ్మ దగ్గర ఓ వంద తీసుకున్నారా...మరి ఇవ్వదు" నిట్టూర్చాడు.

"అరే భాయ్, ఇస్‌మే క్యాహై. మత్‌గభ్‌రావ్. పైసా మేరా పాస్ హై!"

"పైసా కాదురా చిట్టిలంద్రీ, ఇవాళ్టికి నన్నొదిలెయ్యండి. నాకు వేరే పనుంది" ఎలా బయటపడాలో తోచలేదు అరుణకి

"బోధ పడిందిలేరా!" కిశోర్‌గాడు వెధవ. ఊరుకోరాదూ, వినుగ్గా ఉంది అరుణకి.

"క్యా మత్‌లబ్, కుసుమ్‌కే వాస్తే క్యా?"

మిత్రులంతా నవ్వారు

* * *

కామాక్షమ్మ మనసు గ్రామం మీదకు పోయింది గ్రామం వెళ్లి ఎన్నాళ్లయిందీ! మళ్ళీ అందరినీ చూడొచ్చు. ఎంత హైదరాబాదు జీవితానికి అంకితమైపోయినా మళ్ళీ స్వగ్రామంలో ఓ వారం రోజులుండాలంటే ఎంత ఉత్సాహం!

అన్నయ్య పద్మనాభం కూడా పెళ్లికి వస్తాడు వాడికేం మహారాజు ఇల్లు కదలవలసిన అవసరం లేదు అథవా వ్యాపారరీత్యా ఎక్కడికైనా వెళితే మూడోరోజు రాత్రికి తిరిగి వచ్చేస్తాడు. నిర్మల ఎలాగైనా అదృష్టవంతురాలు.

అనూరాధ ఎలా ఉందో! అనూరాధ ఇప్పుడు పెళ్ళి కూతుర్ని పెంచుకున్న తల్లి, నారాయణమూర్తిగారి భార్య పాపం అనూరాధ. తను కాపురానికి వచ్చేసరికే అనూరాధకు పాతికేళ్ళు పైబడ్డాయ్

పిల్లలకోసం ఎన్ని నోములూ, వ్రతాలూ, చేసిందనీ! కన బడ ప్రతిరాయికీ, రప్పకీ పుట్టకీ, గట్టుకీ మొక్కింది అభిషే కాలు చేయించింది పూజలు చేసింది తీర్థాలు సేవించింది. బత్తిగా సత్తెకాలపు మనిషి.

నారాయణమూర్తిగారు కొద్దిగా చదువుకున్నారు!

మంత్రాలని చింతకాయలు కొట్టలేని శబ్దాలని తీసిపారె య్యక పోయినా, ఎందుకేనా మంచిదని పెద్ద పెద్ద డాక్టర్లను సంప్రదించారు దంపతులిద్దరూ ఏవేవో మందులు వాడారు అనూరాధ ఆపరేషన్ చేయించుకుంది లాభం లేకపోయింది మాన సికంగా కుంగిపోయారు దంపతులు పోనీ వారు పెంచుకున్న ఆ అమ్మాయికైనా సంతానం కలిగితే వారి లోటు కొంత తీరు తుంది.

క్రింద స్కూటర్ శబ్దం.

"అమ్మా రాత్రి సినిమా కెళుతున్నాం నేనొచ్చేసరికి ఆల స్యం అవుతుంది"

సినిమా సరేలేరా, బట్టలుసర్దుకో, గంట్వాడ రాతగారింటికి వెళదాం రాజేంద్రుడి పెళ్ళట, నాన్నగారు చెప్పారు"

"గంట్వాడా, పెళ్ళికి నేనెందుకమ్మా, మువ్వెళ్ళరాదూ, నాకు చాలా పనులున్నాయ్ ప్రెంచిక్లాసులు పోతాయ్ నేను రావడానికి వీలుకాదమ్మా!" తువాలు తీసుకొని బాత్‌రూమ్ లోకి వెళ్ళి పోయాడు

—ఇంటిదగ్గర కామాక్షమ్మ మనసుతో పాటు ఆఫీసులో అర్జంటుగా సంపాదకీయం రాయాల్సిన వెంకట్రామయ్యగారి మనసు కూడా గతంలోకి పోయింది

నాన్నగారంటే తనకెంతో భయం బాబాయి తన నెంతో గారంగా చూసేవాడు తను స్కూల్లో చదివేరోజుల్లో తన మీద ఈగవాలనిచ్చే వాడు కాదు ఊళ్ళో తనసైజు కుర్రకాయలందరికీ బాబాయంటే హడల్.

తనుచిన్నప్పటినుంచీ భావ ప్రపంచంలోనే విహరించేవాడు పిల్లలందరితోనూ కలిసి ఆటలాడడం తనకు చేతకాని పని తనలాగే దూరంగా కూచునే మరో పిల్లవాడుండేవాడు, సుర్నాథం అని ఇప్పుడెక్కడున్నాడో! అతన్ని మిగిలిన పిల్లలంతా బాగా ఏడి పించేవారు క్లాసులో అతని పుస్తకాలు మాయమైపోతూ ఉండేవి కంపసు బాక్సులో ఉండవలసినవి ఉండేవికావు పుస్త కాల మీద, ముఖ్యంగా కాంపోజిషన్ పుస్తకంమీద ఇంకుసీసా బోర్లి గిల పడుతూ ఉండేది.

అన్నిటికీ అందరూ మేష్టారు వద్ద సుర్నాథం మీదే రిపోర్ట్ చేసేవారు ఇలా అల్లరిపట్టించే కుర్రాళ్ళు తనజోలికి మాత్రం వచ్చేవారుకారు. తను ఎక్కడో కూచుని చదువుకుం టుండేవాడు

"ఆ కృష్ణమూర్తి చంపేస్తాడోయ్!" అంటూ తనజోలికి మాత్రం వచ్చేవారుకారు .ఈ పెళ్ళికెలా వెళ్ళడం?

తన కాలం తన చేతిలోలేదు. పత్రికా తన సర్వస్వం అయి కూచుంది సుమారు ఇరవై ఏళ్ళయింది తను హైదరాబాదు వచ్చి ఎప్పుడూ మూడురోజులు ముందు స్వగ్రామం వెళ్ళలేక పోతున్నాడు అదైనా నాలుగైదేళ్ల కొకసారి.

పత్రిక మీద తనకు పూర్తి పెత్తనం వచ్చినదగ్గరనుండీ ఊరు కదలడమే కష్టంగావుంది

అమ్మనీ, నాన్నగారినీ చూసి యెన్నాళ్ళయింది? వాళ్ళే యెప్పుడైనా యిటు రావడం కాని తనెప్పుడైనా వెళ్ళి వాళ్ళతో ఓ నెల రోజులున్నాడా?

ఇదిగో మరో రెండేళ్ళు, తనింక రిటైరైపోవాలి అరుణ ఎం ఏ పూర్తి అయితే ఓ సంవత్సరం జర్నలిజం చదివించి తనదగ్గరే కొన్నినెలలపాటు తరిఫీదిచ్చి మెల్లగా వానప్రస్థం పుచ్చు కోవాలని ఆశ కొడుకు పెద్దయి కాలేజీ క్లాసులోకి వచ్చినప్పటి నుండీ తన కదే ఆరాటం

ఆలోచిస్తూ ఉత్తరాలు తిరగేస్తుండగా నాన్నగారి దస్తూరీతో కార్డు. చి వెంకట్రామయ్యకు

నాన్న ఆశీర్వచనములు ఉభయకుశలోపరి కృష్ణమూర్తి కొడుక్కి 30 వ తేదీన పెళ్ళి చాలా రోజులనుండి అనుకుంటున్న సంబంధమైనా ఇంత జరురుగా పెళ్ళి జరుగుతుందని అనుకో లేదు కాల వ్యవధి లేదు కోడలినీ, అరుణనీ తీసుకుని తప్పకుండా రా ముసలివాళ్ళమయి పోతున్నాం నీ పేపరుకోసం కన్నవాళ్ళను వదిలేస్తావా? మీ అమ్మ ఆరోగ్యం బాగులేదు చూడాలని ఉందని మరీ మరీ రాయమంది.

నాన్న.

నాన్నగారికి తనేం చెయ్యగలిగాడు?

అంత పాలాన్ని ఒక్కరే చ సుకుంటూ నానా యాతనా

ఏడుతున్నారు అమ్మకి కన్ను ఆపరేషన్ అని రాస్తే ఐదేళ్ళక్రితం విశాఖపట్నంవెళ్లి ఆస్పత్రిలో ఉన్న అమ్మని ఓ గంట చూసి మళ్ళీ విమానం ఎక్కేశాడు. వాళ్ళకడుపునపుట్టి తనువాళ్ళనేం సుఖ పెట్టేనట్టు?

మనసులో ఆరాటపడుతుంటే తన కోరిక, తన ఆశా జ్ఞాపకం వచ్చాయ్ తన కొడుకు తన వృత్తిని స్వీకరించి తనకు కొంత భారాన్ని తగ్గిస్తాడని తనెంత ఆశిస్తున్నాడు? తన తల్లి దండ్రుల ఆశ తనేం తీర్చేడని తన కొడుకుమీద తనకంత ఆశ?

"ఆశా, ఆపలీ, అందరిదీ ఒకటే"

—బామ్మ మాటలు జ్ఞాపకం వచ్చాయ్.

ఛీ, తన జీవితం వ్యర్థం!

"అయ్యగారూ, డిక్టేషన్ తీసుకోడానికి రమ్మంటారా అని శేఖర్‌బాబుగారడుగుతున్నారు"

—మెల్లగా జవాను చెప్పాడు సొంతం గదిలోకి రాకుండానే

"ఈ వేళ నా వంట్లో బాగులేదు శేషయ్యగారి దగ్గరకు వెళ్లమని చెప్పు"

—బొంగురుపోతున్న గొంతుతో సమాధానం చెప్పి కండువాతో కళ్ళు తుడుచుకున్నారు వెంకట్రామయ్యగారు.

---

# స్వాగతి

## శ్రీ శనగన నరసింహస్వామి

1

కొమ్మకొమ్మకు సభవేసి కోకిలములు
తీగతీగకు మూగి ఇందీవరములు
కలరవమ్ముల నీకు స్వాగతము పలికె
రాక్షసాహ్వయహాయనా! రమ్ము! రమ్ము!

2

పేరు గొప్ప లోన సారమ్ము శూన్యము
నేతి బీరకాయ ఖ్యాతియెల్ల
పెరిగె ధరలు పెంచి యానందవర్షమ్ము
రమ్ముగాది! సౌఖ్య రాజవీధి!

3

కేవలసుఖమ్ము తృప్తికి ద్రోహకాదు
దుస్సహము నిత్యదారిద్ర్య దుఃఖభరము
చేదుతీపుల కొకపాటి చెలిమిచెల్లు
బ్రదుకు చూపుము! నూత్నసంవత్సరాది!